సాక్షి
నంద్యాల
సోమవారం । 20 । మార్చి । 2023



శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి
మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస హరీష్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు న్యాయమూర్తిని ఆశీర్వదించారు.



నోరు మంచిదైతే..!
కోవిడ్ అనంతరం నోటి ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారింది. యువకులు, మధ్యవయస్సు వారిలో నోటి దుర్వాసన అధికమైంది. దీంతో వైద్యుల వద్దకు క్యూ కడుతున్నారు. 8లో

ఉష్ణోగ్రతలు

కనిష్టం	21.6
గరిష్టం	34.0

న్యూస్‌రీల్

నేడు స్పందన

నంద్యాల: స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

పోలీసు స్పందన రద్దు

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉగాది ఉత్సవాల నేపథ్యంలో పోలీసు అధికారులు బందోబస్తు విధుల్లో ఉండటంతో స్పందనను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

కన్నడ భక్తులకు ఏలోటు రానివ్వం

- ఈఓ లవన్న



శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్రల నుంచి తరలివచ్చిన కన్నడ భక్తులకు ఏలోటు రానివ్వకుండా అన్ని ఏర్పాట్లు చేశామని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతేడాది చోటు చేసుకున్న సంఘటనలు పునరావృతం కాకుండా ఉత్సవాలకు పది రోజుల ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. అలాగే శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి వారిచే కన్నడ భక్త బృందాలకు, భక్తులకు ఉత్సవాల నిర్వహణపై సందేశం ఇచ్చారన్నారు. రద్దీ దృష్ట్యా ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం కల్పిస్తున్నామని తెలిపారు. ఏపీ పోలీసులతో పాటు, కర్ణాటక నుంచి 300 మంది పోలీసులు ఉత్సవాల విధులు నిర్వహిస్తున్నారన్నారు. కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి 800 మంది స్వచ్ఛంద సేవకులు కూడా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. క్షేత్ర పరిధిలో అధిక ధరలకు చోటులేకుండా లీగల్ మెట్రాలజీ అధికారులతో, దేవస్థాన చీఫ్ సెక్యూరిటీ అధికారితో ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామన్నారు.

టీబీ డ్యామ్‌కు 1,020 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



హొళగుంద: తుంగభద్ర రిజర్వాయర్(టీబీ డ్యాం)కు రెండు రోజులుగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం ఇన్‌ఫ్లో 689 క్యూసెక్యులు ఉండగా ఆదివారం 1,020కు పెరిగింది. డ్యామ్‌లో 1,633 అడుగులకు గాను 1,594.85 అడుగులు, 105.788 టీఎంసీల పూర్తి నీటి సామర్థ్యానికి గాను 15.558 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఔట్ ఫ్లో 9,169 క్యూసెక్కులు ఉంది. ఎల్లెల్సీ ఆంధ్ర కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 506 క్యూసెక్కుల ప్రవాహం ఉంది.

వచ్చే నెల చివరి వరకు సాగు నీరు

పాణ్యం: ఎస్సార్బీసీ కాల్వ కింద సాగు చేస్తున్న రైతులకు ఏప్రిల్ ఆఖరు వరకు సాగు నీరు అందిస్తామని ఈఈ సుభకుమార్ తెలిపారు. ప్రస్తుతం గోరుకల్లు జలాశయంలో 6.02 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు. ప్రతి రోజూ ఎస్సార్బీసీ కాల్వ ద్వారా 700 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు.

శ్రీగిరి.. ఉత్సవ భేరి



- శాస్త్రోక్తంగా ప్రారంభమైన ఉగాది మహోత్సవాలు
- ఐదు రోజుల పాటు వైభవంగా జరుగనున్న వేడుకలు
- మహాలక్ష్మి అలంకారంలో శ్రీశైల భ్రామరీ
- భృంగివాహనంపై దర్శనమిచ్చిన స్వామిఅమ్మవార్లు



భక్తజన సందోహం మధ్య ఉత్సవమూర్తుల ఆలయ ప్రదక్షిణ (ఇన్‌సెట్) అంకురార్పణ పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, అష్టాదశ శక్తి పీఠం కలసి వెలిసిన శ్రీశైల క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులు పాటు జరిగే ఉత్సవాలకు ఆదివారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అంకురార్పణ చేశారు. వేడుకల్లో పాల్గొనేందుకు కన్నడ, మహారాష్ట్ర భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. మొదటి రోజు శ్రీశైల భ్రామరి మహాలక్ష్మి అలంకారంలో దర్శనమివ్వగా, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లు భృంగివాహనంపై భక్తులను అనుగ్రహించారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు, స్థానాచార్యులు, అర్చకులు, వేదపండితులు, అధికారులు సంప్రదాయ బద్ధంగా ఆలయ ప్రాంగణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం వేదపండితులు చతుర్వేదపారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించారు. అలాగే స్థానాచార్యులు లోకక్షేమాన్ని కాంక్షిస్తూ ఉత్సవ సంకల్పాన్ని పఠించారు. ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం చండీశ్వరునికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అధికారులు, అర్చకులు కంకణాలను ధరించారు. రుత్వికులకు దీక్షావస్త్రాలను అందజేశారు. అలాగే అఖండ దీప స్థాపన, వాస్తుపూజ, వాస్తుహోమం నిర్వహించారు. కలశస్థాపన, పంచావరణార్చనలు, జపానుష్ఠానాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనల పూజలు జరిపించారు. అనంతరం ఉగాది మహోత్సవాలకు అంకురార్పణ చేశారు.



రంగులు చల్లుకుంటూ కన్నడిగుల ఆనందం



లంబాడీల నృత్య ప్రదర్శన



దేవతల వేషధారణలో..

మహాలక్ష్మి అలంకారంలో భ్రామరి

ఉగాది మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శ్రీశైల భ్రమరాంబాదేవి మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మి అలంకారంలోని అమ్మవారికి అలంకార మండపంలో ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజాహారతులిచ్చారు. చతుర్భుజాలు కలిగిన ఈ దేవిపై రెండు చేతులలో పద్మాల ను, కింది చేతులలో కుడివైపున అభయహస్తం, ఎడమవైపున వరముద్రతో దర్శనం ఇచ్చారు. మహాలక్ష్మి స్వ రూపాన్ని దర్శించడం వలన శత్రుబాధలు నివారించబడి, సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

కన్నడిగులతో కిటకిట..

కన్నడ భక్తులతో శ్రీగిరి క్షేత్రం కిటకిటలాడుతోంది. ఉత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుంటున్నారు. మహోత్సవాలను కనులారా తిలకించి తన ఇంటి ఆడపడుచు అయిన శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారిని, మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరుతున్నారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, బిస్కెట్లు, పాలు నిరంతరం పంపిణీ చేస్తున్నారు. భక్తులందరికీ అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. క్షేత్రంలో పలుచోట్ల కన్నడ భక్తులు తమతో పాటు తెచ్చుకున్న పల్లకీకి ప్రత్యేక పూజలు, భజనలు, తప్పెట వాయిద్యాల మధ్య రంగులు చల్లుకుంటు చిందులు వేస్తూ మల్లన్నను కీర్తిస్తున్నారు. క్షేత్రం మొత్తం కన్నడ భక్తమయమైంది.

భృంగివాహనంపై మల్లన్న విహారం..

ఉగాది మహోత్సవాల్లో భాగంగా శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనంపై ఉంచి అలంకార మండపంలో పూజలు నిర్వహించారు. భృంగివాహనాధీశులైన శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించడం వలన పనులలో ఏకాగ్రత లభిస్తుందని, పాపాలను హరించబడుతాయని భక్తుల విశ్వాసం. అనంతరం ప్రత్యేక అలంకీకృతులైన అమ్మవారికి, వాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. శంఖం, డమరకం, జేగంట, కొమ్మువాయిద్యం, కోలాటం, చెక్కభజన, జానపద, పగటి వేషాల ప్రదర్శన, తప్పెట విందు, కర్ణాటక జాంజ్, డోలు విన్యాసాలు, వీరగాసీ, జానపదడోలు, నందికోలు, కంచుడోలు మొదలైన కార్యక్రమాలు గ్రామోత్సవానికి మరింత వన్నె తెచ్చాయి. స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. గ్రామోత్సవంలో ఏఈవోలు హరిదాసు, ఫణిధరప్రసాద్, పర్యవేక్షకులు అయ్యన్న, శ్రీహరి, శ్రీశైలప్రభ సంపాదకులు అనిల్‌కుమార్, పీఆర్వో టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో నేడు..

ఉగాది మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం భ్రమరాంబాదేవికి మహాదుర్గ అలంకారం, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు కైలాస వాహనసేవ నిర్వహించనున్నారు. అనంతరం గ్రామోత్సవం చేపడుతారు.

పంట నష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వండి

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

మిడుతూరు: అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇవ్వాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి.. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. తలముడిపి, జలకనూరు గ్రామాల్లో దెబ్బతిన్న అరటి, బొప్పాయి, పండు మిరప, మొక్కజొన్న తదితర పంటలను ఆదివారం ఎంపీ పరిశీలించారు. ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కౌలు రైతులకు న్యాయం జరిగేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎంపీ వెంట జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ వెంకటేశ్వర్లు, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ చైర్మన్ నాగ తులసిరెడ్డి, పట్టణ మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నబీ రసూల్, నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, హార్టికల్చర్ ఏఓ తేజస్విణి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివ రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు హరిసర్వోత్తమరెడ్డి, స్వామన్న తదితరులు ఉన్నారు.



తలముడిపిలో దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలిస్తున్న నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

లో లెవల్ బ్రిడ్జికి నిధులు మంజూరు చేయండి..

తలముడిపి గ్రామంలో పొలాలకు వెళ్లే రైతుల సౌకర్యార్థం కుందూనదిపై లోలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామ రైతులు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డికి విన్నవించారు. కుందూనదిపై బ్రిడ్జి నిర్మించడంతో పంట దిగుబడులను పొలాలను ఇంటికి చేర్చుకోవడంతో పాటు జలకనూరు గ్రామానికి రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.

ఉన్నత విద్యకు ప్రభుత్వం భరోసా

- జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల చేసిన సీఎం జగన్

నంద్యాల: జగనన్న విద్యా దీవెన పథకంతో పేదల ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని సోషల్ వెల్ఫేర్ డీడీ చింతామణి అన్నారు. జగనన్న విద్యా దీవెన–2022 అక్టోబర్ త్రైమాసికానికి సంబంధించి నిధులు ఆదివారం విడుదలయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నంద్యాల జిల్లాలోని 36,352 మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజును 32,542 మంది తల్లుల ఖాతాల్లో రూ.24.93 కోట్లు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బీసీ, సోషల్ వెల్ఫేర్ అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలెక్టరేట్ నుంచి వీక్షించారు. జిల్లాలో 14,403 మంది బీసీ విద్యార్థులకు రూ. 8.59 కోట్లు, 3,992 మంది ఈబీసీ విద్యార్థులకు రూ. 3.48 కోట్లు, 2769 మంది కాపులకు రూ.1.79 కోట్లు, 5,654 మంది ముస్లింలకు రూ. 3.08 కోట్లు, 8,341 మంది ఎస్సీలకు రూ.7.31 కోట్లు, 9909 మంది ఎస్టీలకు రూ.5.08 కోట్లు, 84 మంది క్రిస్టియన్ విద్యార్థులకు రూ. 64.09 లక్షలు వారి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ సందర్భంగా సోషల్ వెల్ఫేర్ డీడీ చింతామణి మాట్లాడుతూ ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, తదితర కోర్సులు అభ్యసించే విద్యార్థులను మొదలుకొని పీహెచ్‌డీ చదివే వారికి కాలేజీ ఫీజు మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు భారం కాకుండా ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన కింద అందజేస్తుందన్నారు. జిల్లాలో అర్హులైన విద్యార్థులందరికీ కాలేజీ ఫీజు వారి తల్లుల ఖాతాల్లో నిధులు జమ అయ్యాయని, అర్హులైన వారు ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి లక్ష్మీదేవి, ఏఎస్‌డబ్ల్యూఓ హుసేనయ్య పాల్గొన్నారు.



జగనన్న విద్యాదీవెన చెక్కును అందజేస్తున్న అధికారులు

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

- కర్నూలు– శ్రీశైలం చార్జీ రూ.350

కర్నూలు(రాజ్‌విహార్): ఉగాది పండుగ సందర్భంగా శ్రీశైల క్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉండటంతో శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళిక రూపొందించారు. కర్నూలు జిల్లాలోని 4 డిపోల నుంచి 130 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఇందులో కర్నూలు జిల్లాకు చెందినవి 75, ఇతర జిల్లాలకు చెందిన 55 బస్సులున్నాయి. ఆదోని నుంచి శ్రీశైలానికి 35, కర్నూలు–1 డిపో నుంచి 32, ఎమ్మిగనూరు–30, కర్నూలు–2డిపో నుంచి 33, కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం కర్నూలు– వెంకటాపురం మధ్య రద్దీ మేరకు బస్సులు నడపనున్నారు. తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు పడకుండా బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నారు. డీజిల్ ధరలు పెంచినా భక్తులపై భారం పడకుండా గత ఏడాది చార్జీలనే వసూలు చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం టి. వెంకటరామం తెలిపారు. కర్నూలు నుంచి శ్రీశైలానికి రూ.350, ఆదోని నుంచి రూ.500, ఎమ్మిగనూరు నుంచి రూ.450, కోడుమూరు నుంచి రూ.400, నందికొట్కూరు నుంచి రూ.300, ఆత్మకూరు నుంచి రూ.250, మహానంది నుంచి రూ.350, కర్నూలు–వెంకటాపురానికి రూ.150 చొప్పున చార్జీ వసూలు చేయనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగి హల్‌చల్

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు బెదిరింపులు

పగిడ్యాల: ప్రభుత్వం తరపున ప్రజలకు సేవలు అందించాల్సిన ఓ గవర్నమెంట్ ఉద్యోగి టీడీపీ కార్యకర్తగా మారి హల్‌చల్ సృష్టించారు. ఇదేమిటని అడిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై బెదిరింపులు దిగాడు. ఈ ఘటన పగిడ్యాల మండలం పడమర ప్రాతకోటలో చోటుచేసుకుంది. ఎస్‌ఆర్‌బీసీ పాణ్యం డివిజన్ పరిధిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దండువారి శ్రీనివాస్ అలియాస్ బళ్లారి శ్రీనివాసులు ప్రాతకోటలో నివాసం ఉంటున్నారు. ప్రతి రోజూ విధుల నిమిత్తం పాణ్యం వెళ్లి వస్తుంటారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించడంతో ఆపార్టీ కార్యకర్తలు శనివారం రాత్రి గ్రామంలోని శేషశయనారెడ్డి బోర్డు నుంచి కేసీ కెనాల్ బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దండువారి శ్రీనివాస్ సొంత ఖర్చులతో టపాసులు కాల్చుతూ వివాదాలకు ఆద్యుడయ్యారు. అంతటితో ఆగకుండా అత్యుత్సాహంతో వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తలను టార్గెట్ చేసి వ్యక్తిగత దూషణలకు దిగాడు. ఈ ఆడియో, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఇది జీర్ణించుకోలేని ఉద్యోగి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై బెదిరింపులకు దిగాడు. ఈ విషయమై ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జునను అడుగగా తాను ఉగాది ఉత్సవాల్లో భాగంగా శ్రీశైలం బందోబస్తులో ఉన్నానని, విజయోత్సవ ర్యాలీలకు తాము ఎలాంటి అనుమతి ఇవ్వలేదన్నారు. పడమర ప్రాతకోట ఫ్యాక్షన్ గ్రామమని, అక్కడ ర్యాలీ నిర్వహిస్తూ టపాసులు పేల్చడం చట్ట విరుద్ధమన్నారు.



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను బెదిరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగి

పల్లె గొంతెండకుండా..

- వేసవిలో నీటిఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు
- 15 మండలాలపై ప్రత్యేక దృష్టి
- 134 గ్రామాల్లో 283 పనులు గుర్తింపు
- రూ.2.89 కోట్లతో ప్రతిపాదనలు పంపిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

నంద్యాల(రూరల్): వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా జిల్లా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ శాఖలతో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు సమన్వయం చేసుకొని నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ఏడాది జూన్ వరకు ఎలాంటి సమస్య రాకుండా ముందుగానే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. వెంటనే మంచినీటి పథకాల మరమ్మతులు, పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ఈ వేసవిలో జిల్లా వ్యాప్తంగా బేతంచెర్ల, ప్యాపిలి, డోన్, సంజామల, బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, గడివేముల, పాణ్యం, నందికొట్కూరు, మిడుతూరు, బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది తదితర మండలాల పరిధిలోని 134 గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణకు రూ.2.89 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపించారు. గతంతో పోల్చితే జిల్లాలో ఈ వేసవిలో నీటి ఎద్దడి తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉంది. గతేడాది వేసవిలో జిల్లాలో 21 మండలాల్లో 189 గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడింది. కాగా గతేడాది వర్షాకాలంలో జిల్లాలో భారీ వర్షాలు కురవడంతోపాటు రిజర్వాయర్లు, నదులు, చెరువులు, వాగుల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో భూగర్భ జలాలు బాగా పెరిగాయి. దీతో గతంలో మాదిరిగా గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటిని ట్యాంకర్లతో సరఫరా చేసే పరిస్థితి ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు.



నంద్యాల మండలం చాబోలులో మంచినీటిని పట్టుకుంటున్న మహిళ

నీటి సమస్యల ఫిర్యాదుకు హెల్ప్‌లైన్..

వేసవి నేపథ్యంలో ఏదైనా గ్రామాల్లో తలెత్తే మంచినీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ప్రత్యేక సెల్ (హెల్ప్‌డెస్క్) ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించారు. జిల్లాలో ఎక్కడైనా నీటి ఎద్దడి ఏర్పడితే 08514–244424కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే సమీప ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకొని నీటి సమస్యను పరిష్కరిస్తారు. ఆయా కార్యాలయాల్లో సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటారు. రాష్ట్రంలో జరుగుతున్న జలజీవన్ మిషన్ పథకం పనులను పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర కమిటీ సభ్యులు జిల్లాలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను శుక్రవారం పరిశీలించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అభినందించారు.

ప్రతిపాదనలు పంపించాం



ఫిబ్రవరి, మార్చి నెలల్లో అధికారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి బోర్లను పరిశీలించారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా నీటి సమస్య లేదు. మంచి నీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా పనులు చేపట్టేందుకు రూ. 2.89 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నీటి ఎద్దడి తలెత్తే గ్రామీణ ప్రజలు హెల్ప్‌లైన్‌ను సద్వినియోగం చేసుకుని సమస్యను పరిష్కరించుకోవాలి.
– మనోహర్, జిల్లా గ్రామీణ నీటిపారుదలశాఖ అధికారి, నంద్యాల

మండు వేసవిలో వజ్రాన్వేషణ

తుగ్గలి: మామూలుగా తొలకరి వర్షాలకు వజ్రాల వేట మొదలవుతుంది. అయితే గత రెండేళ్లుగా వేసవిలోనూ వజ్రాలు వెతికేందుకు వస్తున్నారు. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో కడప, ఒంగోలు తదితర ప్రాంతాలకు చెందిన పలువురు వజ్రాలు వెతికేందుకు జొన్నగిరికి వచ్చారు. ఈ ప్రాంతంలో వర్షం లేకున్నా పొలాల్లో వజ్రాలు వెతుకుతున్నారు. తొలకరి వర్షాలకు ఏటా ఈ ప్రాంతంలో వజ్రాలు లభ్యమవడం సర్వ సాధారణం. వజ్రాన్వేషకుల తాకిడి ఎక్కువై పంట పొలాలు గట్టిపడుతుండడంతో గతేడాది రైతులంతా కలిసి వజ్రాన్వేషకులు ఎవరూ రావద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం గమనార్హం. గతంలో రైతులపై వజ్రాన్వేషకులు దాడులకు దిగడం కూడా చోటచేసుకుంది. విత్తనానికి ముందుకు రైతులు వజ్రాన్వేషకులను నిలువరించేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది.



జొన్నగిరి వద్ద వజ్రాన్వేషణ చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

పాలేరు వాగులో వ్యక్తి గల్లంతు

సంజామల(కోవెలకుంట్ల): మండల కేంద్రం సంజామల సమీపంలో ప్రవహిస్తున్న పాలేరు వాగులో ఆదివారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన పెద్ద వెంకటయ్య గత కొంతకాలంగా వ్యక్తిగత సమస్యలతో బాధపడుతున్నాడు. ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. చివరకు గ్రామ సమీపంలోని పాలేరు వాగు గట్టుపై ఉదయం వేసుకున్న బట్టలు, చెప్పులు, సెల్‌ఫోన్ ఉండటంతో వాగులో గల్లంతై ఉండొచ్చని భావించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించడంతో గాలింపు చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారుడికి గాయాలు



చెట్టుకు ఢీ కొన్న వాహనం

గూడూరు రూరల్: మండల పరిధిలోని పొన్నకల్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారుడికి గాయాలయ్యాయి. పోలకల్‌కు చెందిన తండ్రి, కొడుకు కారం జిన్నె పెద్ద లక్ష్మన్న, గోవిందు వట్టి మిర్చి వ్యాపారం చేస్తారు. అయితే, పని నిమిత్తం వారు ట్రాలీ వాహనంలో గూడూరుకువెళ్లి తిరిగి వస్తుండగా పొన్నకల్ సమీపంలోని దాల్ మిల్ వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న గోవిందుతో పాటు తండ్రి లక్ష్మన్నకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నరేంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తుగ్గలి మండలంలో ఐదుగురికి..

తుగ్గలి : మండల పరిధిలోని రాతన వద్ద ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడ్డారు. చెన్నంపల్లి నుంచి బైక్‌పై పత్తికొండకు వెళుతున్న రాజేష్, లక్ష్మీలను ఆదోని వైపు నుంచి వస్తున్న కారు రాతన వద్ద ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన క్షతగాత్రులను పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అదే విధంగా చెరువుకట్ట సమీపంలో గుంతకల్లుకు వెళుతున్న ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

తప్పిన ప్రమాదం

ఆదోని అర్బన్ : స్థానిక కొడల్‌పేటలోని ఓ ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. అయితే, ఇంటి యజమాని శోభారాణి వెంటనే అప్రమత్తమై స్థానికుల సహాయంతో మంటలను ఆర్పివేసింది. లేకపోతే ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లేదని బాధితురాలు తెలిపారు.

నోరు మంచిదైతే..!

- మన ఆరోగ్యం బాగుంటుంది
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- నేడు నోటి ఆరోగ్య దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్): నోరు మంచిదైతే..ఊరు మంచిదవుతుందన్న సామెత ఉంది. అలాగే నోటికీ ఆరోగ్యానికి సంబంధం ఉందంటున్నారు వైద్యులు. కోవిడ్ అనంతరం నోటి ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారింది. యువకులు, మధ్యవయస్సు వారిలో నోటి దుర్వాసన అధికమైంది. అనుకోని ఈ రుగ్మత ఏమిటో అర్థం గాక జనం తల పట్టుకుంటున్నారు. నోరు పట్టుకుని దంత వైద్యుల వద్దకు క్యూ కడుతున్నారు. దీంతో పాటు పలు దంత వ్యాధులకు చికిత్స చేయించుకునేందుకు, నోటి ఆరోగ్యం, అందం కోసం వారిని సంప్రదించే వారు అధికమయ్యారు. ఈ నెల 20వ తేదిన 'నోటి ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

బ్యాక్టీరియానే కారణం..

నోటి దుర్వాసనకు కారణం నిత్యం మన నోట్లో ఉత్పత్తి అవుతున్న బ్యాక్టీరియానేనని వైద్యులు చెబుతున్నారు. తరచూ నోటిని శుభ్రం చేసుకోకపోతే ఇది దుర్వాసన కలిగించి క్రమంగా నోటి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అధికంగా మాట్లాడే వారిలో, నీటిని తక్కువగా తాగే వారిలో ఈ సమస్య మరింత అధికంగా ఉంటోంది. సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, జీర్ణాశయ సమస్యలున్న వారిలోనూ ఈ సమస్య వస్తుందని వైద్యులు చెబుతున్నారు.

పెరుగుతున్న దంత సమస్యలు

జిల్లాలో 70 నుంచి 80 శాతం ప్రజలు దంత సమస్యలతో బాధపడుతున్నారని వైద్యులు అంచనా వేస్తున్నారు. కర్నూలుతో పాటు, దేవనకొండ, పత్తికొండ, కోడుమూరు, కల్లూరు, ఆదోని, ఆస్పరి వంటి ప్రాంతాల్లో తాగునీటి సమస్య వల్ల ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండే నీటిని తాగుతున్నారు. దీనివల్ల పంటిపై పచ్చని రంగులో మచ్చలు ఏర్పడతాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు సరిగ్గా టూత్‌బ్రష్ చేయకపోవడం, ఏదైనా తిన్న తర్వాత నోటిని పుక్కిలించకపోవడం వల్ల సమస్యలు వస్తున్నాయి. పంటి చుట్టూ గార ఏర్పడి చిగుళ్ల ఇన్‌ఫెక్షన్స్‌గా మారి రక్తం కారుతూ నొప్పి పుడుతుంది. నగరాలు, పట్టణాల్లో సైతం 60 నుంచి 70 శాతం మంది పిప్పి సమస్యలతో బాధపడుతున్నారు.

ఉన్నఫలంగా ఊడిపోతున్న పళ్లు

ఇటీవల కాలంలో 35 ఏళ్ల నుంచి 58 ఏళ్ల వయస్సున్న వారిలో దంత సమస్యలు అధికమయ్యాయి. అది కూడా ఉన్నఫలంగా దంతాలు ఊడిపోవడం వారిని మరింత కలవరపెడుతోంది. కర్నూలు నగరంలోని దంత వైద్యుల వద్దకే ప్రతి నెలా 200 నుంచి 300 మంది దాకా అకస్మాత్తుగా దంతాలు ఊడిపోయి వైద్యుల వద్దకు వస్తున్నారు. ఊహించని ఈ పరిమాణం ఏమిటో అర్థం గాక అటు బాధితులు, ఇటు వైద్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కోవిడ్-19 పరిస్థితుల తర్వాత(పోస్ట్ కోవిడ్) ఈ పరిమాణం అధికమైందని వారు గుర్తించారు. కోవిడ్ తర్వాత షుగర్ రోగుల సంఖ్య పెరగడం, పోషకాహారలోపం కారణంగా వారు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించి మరింత విశ్లేషణ జరుపుతున్నారు. దంతాలు ఊడిపోయి వచ్చిన వారికి ఇన్‌ప్లాంట్స్ వేయడం, పళ్లు కట్టడం చేసి పంపిస్తున్నారు.

నోటి ఆరోగ్యాన్ని దెబ్బతీసే చెడు అలవాట్లు

చాలా మందికి ధూమపానం(పొగతాగడం) వల్ల నోటిపై గారపట్టడం, దుర్వాసన, పళ్లు రంగుమారడం జరుగుతాయి. దీంతో పాటు చిగుళ్లు సైతం బాగా దెబ్బతింటాయి. గుట్కా, జర్దా నమిలే వారిలో ఈ సమస్య మరింత ఎక్కువ. వీరికి అదనంగా నోటి క్యాన్సర్ కూడా వస్తోంది. మద్యపానం చేసే సమయంలో ఇష్టానుసారంగా ఆహారాన్ని తినడం, అది కూడా నమిలి తినకపోవడం వల్ల ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం, పళ్లలో ఆహార పదార్థాలు ఇరుక్కుని రాత్రంతా అలాగే ఉండటం వల్ల బ్యాక్టీరియా వృద్ధి చెంది నోటి సమస్యలు వస్తున్నాయి.

కోవిడ్ తర్వాత సమస్యలు ఎక్కువయ్యాయి



ఇటీవల కాలంలో చిన్న వయస్సు వారి నుంచి పెద్ద వయస్సు వారిలో నోటి దుర్వాసన సమస్య అధికమైంది. మా వద్దకు వచ్చే రోగుల్లో ఎక్కువగా ఈ సమస్యనే చెబుతున్నారు. దీనికి కారణం నోటిని సరిగ్గా శుభ్రం చేసుకోకపోవడం, పిప్పిపళ్లు, ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం. అయితే ఇవేమీ సమస్యలు లేకుండానే ఇటీవల కొందరికి నోటి దుర్వాసన వస్తోంది. అంటే వారికి త్వరలో డయాబెటీస్ రావడం, లేదా ఇప్పటికే వచ్చి ఉండటం జరుగుతోంది. పోస్ట్ కోవిడ్ తర్వాత ఈ సమస్య మరింత అధికమైంది.

–డాక్టర్ పి. సునీల్‌కుమార్‌రెడ్డి, దంత వైద్యనిపుణులు, కర్నూలు

త్రిఫల కషాయంతో నోటిని పుక్కిలించాలి



నోటి శుభ్రంగా ఉంచుకోకపోతే అనేకవ్యాధులు వచ్చేందుకు ఆస్కారం ఉంది. నోరు శుభ్రంగా ఉండాలంటే ముఖ్యంగా త్రిఫల కషాయంతో నోటిని పుక్కిలించాలి. దీనివల్ల నోట్లో బ్యాక్టీరియా వృద్ధి చెందదు. నోటి క్యాన్సర్లు, నోటి అల్సర్లు రాకుండా కాపాడుకోవచ్చు. రాత్రి త్వరగా భోజనం చేయాలి. ఎడమవైపు తిరిగిపడుకోవాలి. దీని వల్ల తిన్న ఆహారం గొంతులోకి రాకుండా ఉంటుంది. ఆయుర్వేదిక్ నేచురల్ టూత్‌పేస్ట్‌లతో దంతాలను శుభ్రం చేసుకోవాలి.

–డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు, కర్నూలు

క్రీడల్లో రాణించాలి





విజేత జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: క్రీడాపోటీల్లో యువత రాణించాలని సెపక్ తక్రా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని నవనంది పాఠశాల ఆవరణలో 33వ రాష్ట్రస్థాయి సీనియర్ సెపక్‌తక్రా చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఇందులో పురుషుల విభాగంలో కర్నూలు జట్టు విజయం సాధించగా, తూర్పు గోదావరి జట్టు రెండో స్థానంలో నిలిచింది. అలాగే మహిళా విభాగంలో అనంతపురం జట్టు గెలుపొందగా కర్నూలు జటు రెండోస్థానంలో నిలిచింది. విజేత జట్లకు మెమెంటోలు అందజేసి శ్రీధర్ మాట్లాడారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు జగదీష్ కుమార్, సీనియర్ న్యాయవాది దాశెట్టి శ్రీనివాసులు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్ట్

- 400 గ్రాముల వెండి, 150 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ



దొంగలను అరెస్ట్ చూపుతున్న పోలీసు అధికారులు



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

కర్నూలు: కర్నూలులోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి కటకటాలకు పంపారు. నాలుగో పట్టణ ఎస్‌ఐ మోహన్‌కిషోర్‌రెడ్డి కర్నూలు వీఆర్ కాలనీ టర్నింగ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద తన సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, మమతానగర్‌కు చెందిన చాకలి అరవింద్, ఎస్‌ఏపీ క్యాంప్ పోలీస్ క్వార్టర్స్‌లో ఉంటున్న ఆకుల మహేష్ బాబు, తిలక్ నగర్‌లో ఉంటున్న వడ్డే రాజశేఖర్ తదితరులు అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాల చిట్టా బయట పడింది. దొంగలను డీఎస్‌పీ కేవీ మహేష్ ఎదుట హాజరు పరచగా ఆయన ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. పట్టుబడిన దొంగలు గత ఏడాది ఆగస్టు 24వ తేదిన సీతారామనగర్‌లో నివాసం ఉంటున్న ఫర్హానాబేగం ఇంట్లో చోరీ చేశారు. అలాగే ఈ ఏడాది జనవరి 12న అయ్యప్పస్వామి నగర్‌లో నివాసం ఉంటున్న సాయిక్రిష్ణ ఇంట్లో, జనవరి 13న వెంకటచలపతి నగర్‌లో నివాసం ఉంటున్న హైమావతి ఇంట్లో, జనవరి 20న గీతానగర్‌లో నివాసం ఉంటున్న జాహ్నవిశెట్టి ఇంట్లో, జనవరి 28న సంతోష్‌నగర్‌లో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ ఇంట్లో చోరీలకు పాల్పడినట్లు విచారణలో అంగీకరించారు. మొత్తం ఐదు కేసుల్లో రూ. 9 లక్షలు విలువ చేసే 400 గ్రామల వెండి, 150 గ్రాముల బంగారు ఆభరణాలు, యాపిల్ ఐఫోన్ రికవరీ చేసినట్లు డీఎస్‌పీ వెల్లడించారు. సమావేశంలో నాలుగో పట్టణ సీఐ శంకరయ్య పాల్గొన్నారు.

మామిడి పంటను కాపాడుకుందామిలా..

- అకాల వర్షాల నేపథ్యంలో జిల్లా ఉద్యాన శాఖ జేడీ సూచనలు



మామిడి తోట

కర్నూలు(అగ్రికల్చర్): ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల మామిడిలో కాయలు రాలడం, కాయలపై మచ్చలు ఏర్పడి నాణ్యత దెబ్బతినే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో మామిడి తోటలు పూత దశ నుంచి కాయలు కోత వరకు వివిధ దశల్లో ఉన్నాయి. వేసవిలో వేలాది మంది రైతులకు మామిడి ప్రధానమైన పంట. ఇటీవల వర్షాలు కురిసిన నేపథ్యంలో మామిడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కర్నూలు ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు పి.రామాంజనేయులు సూచనలు ఇచ్చారు. కాయలు 100 గ్రాములు బరువు ఉన్న తోటలలో వర్షాల వల్ల పిందెలు గట్టిపడి సైజు రావడానికి అవకాశం ఏర్పడిందని తెలిపారు. కాయలు, పూత ఉన్న తోటల్లో కాయ మచ్చ తెగులు, బూడిద తెగులు రావడానికి వీలుంది. ఇటువంటి తోటల్లో ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ, కార్బండజిమ్ 1 గ్రాము లేదా కార్బండజిమ్ 50 శాతం 1 గ్రాము+ మ్యాంకోజబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ఆయన సూచించారు. చిన్న పిందెలు, పూత దశలో ఉన్న తోటల్లో ఈ అకాల వర్షాలకు లేత చిగురు రావడానికి అవకాశం అధికంగా ఉంటుంది. కావున లేత చిగురులను ఆశించే రసం పీల్చే పురుగులు,వాటితో పాటు వచ్చే తేనె మంచు పురుగు, తామరపురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ + ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈదురు గాలుల వల్ల పెద్ద కాయలు రాలినట్లయితే వాటిని చెక్కుతీసి చిన్న, చిన్న ముక్కలు చేసి ఎండబెట్టి 'మామిడి పొడి' తయారు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు పడటంతో రైతులు పైపాటుగా తోటల్లో కలుపు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

హజ్ యాత్ర దరఖాస్తులకు నేడే ఆఖరు

కర్నూలు(రాజ్‌విహార్): హజ్‌కు వెళ్లే యాత్రికులు దరఖాస్తు చేసుకునేందుకు సోమవారంతో గడువు ముగుస్తుందని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హాఫిజ్ మంజూర్ అహ్మద్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 హజ్ మార్గదర్శకాల మేరకు దరఖాస్తు చేసుకునేందుకు ఒక్కరోజు మాత్రమే గడువు మిగిలి ఉందన్నారు. దరఖాస్తుకు పాస్‌పోర్టు మొదటి, చివరి పేజీల కలర్ జిరాక్స్ కాపీని జత చేయాలని, పాస్‌పోర్టు గడువు 2024 ఫిబ్రవరి 3 వరకు ఉండాలని పేర్కొన్నారు. జాతీయ బ్యాంక్ ఖాతా పాస్ బుక్ కలర్ జిరాక్స్/ క్యాన్సిల్డ్ చెక్కు కాపీ, అభ్యర్థులు మెడికల్ స్క్రీనింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, కోవిడ్-19 వ్యాక్సిన్స్ వేసుకున్న సర్టిఫికెట్లు జత చేయాలని చెప్పారు. అలాగే 3.5''3.5 సైజులో రెండు కలర్ ఫొటోలు సమర్పించాలని, దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యాక లాటరీ ద్వారా ఎంపిక ఉంటుందని వెల్లడించారు. 2023 ఏప్రిల్ 30లోపు 70 ఏళ్లు పూర్తయ్యే వారికి డిప్ పద్ధతి కాకుండా నేరుగా ఎంపిక చేయడంతో పాటు వారి వెంట మరొకరికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు సోమవారం సాయంత్రం లోపు కర్నూలులోని బుధవారపేటలో మహబూబ్ సుభాహాని మసీదులోని రాయలసీమ హజ్ సొసైటీ కార్యాలయంలో, పెద్ద మార్కెట్ సమీపంలోని అబుబక్కర్ మసీదులో ఉన్న జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు ఉచితంగా పొందవచ్చన్నారు. అన్ని ధ్రువ పత్రాలు తీసుకెళ్తే అక్కడే కంప్యూటర్‌లో ఉచితంగా ఆన్‌లైన్ కూడా చేస్తారని తెలిపారు. వివరాలకు సెల్: 94402 32564, 99085 45232 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

'లేపాక్షి'లో క్లియరెన్స్ మేళా

కర్నూలు(అగ్రికల్చర్): తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా లేపాక్షి క్లియరెన్స్ సేల్ మేళా నిర్వహిస్తున్నట్లు కర్నూలు లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య తెలిపారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన వస్తువులపై 10 నుంచి 40 శాతం వరకు డిస్కౌంట్‌తో అమ్మకాలు చేపట్టినట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు కొండారెడ్డిబురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ ఎంపోరియంలో డిస్కౌంట్‌తో అన్ని రకాల హస్తకళ వస్తువులు, చేనేత వస్త్రాలు లభిస్తాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కర్నూలు : నగర శివారులోన జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్ద శివన్న (62) అనే వ్యక్తి మృతి చెందాడు. కృష్ణగిరి మండలం తొగిడి చేరు గ్రామానికి చెందిన పెద్ద శివన్న ద్విచక్ర వాహనంపై కర్నూలుకు వస్తుండగా మానస దాబా సమీపంలో వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. జాతీయ రోడ్డు భద్రతా సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్‌లు సంఘటనా స్థలం చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్ర పరిచారు.

యువతి అదృశ్యం

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం వారు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఖాసీంసాహెబ్ కుమార్తె ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుమార్తె కనిపించకపోవటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇళ్లవద్ద గాలించారు. అయినా ఆచూకీ లభించకపోవటంతో బంధువుల వద్ద వాకబుచేశారు. అయినా ప్రయోజనం లేకపోవటంతో జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన బిడ్డ కనిపించకుండా పోవటానికి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కారణమని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు యువతి అదృశ్యమైనట్లు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వంద పనిదినాల పూర్తికి చర్యలు



ఉపాధి పనుల్లో కూలీలు

కర్నూలు(అగ్రికల్చర్): జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలనేది ఎన్‌ఆర్ ఈజీఎస్ లక్ష్యం. ఇప్పటి వరకు దాదాపు 3000 కుటుంబాలు 100 రోజుల పని దినాలు పూర్తి చేసుకున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగియనుంది. ఈ లోపు 90 నుంచి 99 రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న అన్ని కుటుంబాలకు 100 రోజులు పని కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకు అవసరమైన కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. 90 నుంచి 99 రోజుల మధ్య పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు జిల్లాలో 15,448 ఉన్నాయి. ఈ కుటుంబాలను ఉపాధి పనులకు రప్పించి 100 రోజుల పనులు పూర్తి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఏపీడీలు, పీవో,ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఇప్పటికే మండలాలు, గ్రామాల వారీగా కుటుంబాల పనిదినాల జాబితాలను ఏపీడీలు, మండల స్థాయి అధికారులకు పంపారు. ఆయా కుటుంబాలకు 100 రోజులు పనులు కల్పిస్తే.. ఈ ఏడాది దాదాపు 20 వేల కుటుంబాలకు పూర్తి స్థాయిలో ఉపాధి పనులు కల్పించినట్లవుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు షోకాజ్ నోటీసులు

- పేదలకు 25 శాతం సీట్ల కేటాయింపుపై నిర్లక్ష్యం
- విద్యాశాఖ అధికారులు అగ్రహం
- 44 స్కూళ్ల యాజమాన్యాలకు నోటీసుల జారీ

కర్నూలు సిటీ: విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు 2023–24 విద్యాసంవత్సరంలో 25 శాతం సీట్లు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇటీవల పాఠశాల విద్యాశాఖ అడ్మిషన్ల భర్తీ ప్రక్రియకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీన్ని అనుసరించి జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలన్నీ పాఠశాల విద్య పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ ఆదేశించింది. అయితే, జిల్లాలో 44 స్కూళ్ల యాజమాన్యాలు ఈ ఆదేశాలను బేఖాతరు చేశాయి. ఈ నెల 16వ తేదీకే నమోదు గడవు ముగిసినా మరో 3 రోజులు పొడిగించింది. అయినా, సదరు విద్యా సంస్థలు పట్టనట్టు వ్యవహరించడంతో డీఈఓ అగ్రహం వ్యక్తం చేస్తూ ఆదివారం ఆ విద్యా సంస్థలపై చర్యలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

పోర్టల్‌లో నమోదు చేసుకోని స్కూల్స్ ఇవే..

ఆదోని మండలంలోని మోడల్ ప్రైమరీ పాఠశాల (పెద్దహరివాణం), మదర్ థెరిస్సా ఇంగ్లిషు మీడియం ప్రాథమికోన్నత పాఠశాల(క్రాంతినగర్), శ్రీగౌరి గణేష్ ఇంగ్లిషు మీడియం యూపీ స్కూల్ (ధనాపురం), శ్రీవిద్య స్కూల్ (మండగేరి), టీజీఎల్‌కే బాల విద్యా సదన్ (టీజీఎల్ కాలనీ), సెయింట్ పాల్ స్కూల్ (అంబేడ్కర్‌నగర్), కావ్యశ్రీ ఇంగ్లిషు మీడియం స్కూల్ (విక్టోరియా పేట), జవహర్ ఇంగ్లిషు మీడియం స్కూల్ (ఎస్‌కేడీ కాలనీ), శ్రీవెంకటేశ్వర కాన్వెంట్ (సాయిబాబా నగర్), వెస్లీ ఇంగ్లిషు మీడియం యూపీ స్కూల్ (వెంకన్నపేట), చిన్మయా విద్యాలయ (వెంకన్న పేట), కల్లూరు మండలంలో ఇండస్ ప్రైమరీ స్కూల్, శ్రీవిద్యానికేతన్ (శరీన్ నగర్), కర్నూలు అర్బన్ మండల పరిధిలోని ఉమా మాధవి యూపీ స్కూల్ (సంతోష్‌నగర్), కేశవ మెమోరియల్ స్కూల్(బుధవారపేట), ట్రినిటి స్కూల్ (అశోక్‌నగర్), సెయింట్ మేరీస్ స్కూల్ (ఎన్‌ఆర్ పేట), ఉమర్ ఎయిడెడ్ అరబిక్ ప్రైమరీ స్కూల్ (ఉస్మానియా కాలేజీ కాంపౌండ్), సాయుధ పోలీసు విద్యాలయం (ఎస్‌ఏపీ క్యాంపు), ఆర్‌ఆర్ ఇంగ్లిషు మీడియం స్కూల్ (జేఎస్‌ఆర్ నగర్–ఎంఎస్ నగర్), శ్రీరామ స్కూల్ (పెద్ద పడఖాన), ఏలైట్ ఇంగ్లిషు మీడియం స్కూల్ (నరసింహారెడ్డి నగర్), వెస్లీ ఇంగ్లిషు మీడియం స్కూల్ (బుధవార పేట), అంబికా శిశు కేంద్ర స్కూల్ (ప్రకాష్‌నగర్), పీవీటీ ఆన్ ఎయిడెడ్ స్కూల్ (చల్లావారి వీధి), సమతా స్కూల్ (గాంధీనగర్), కర్నూలు రూరల్ మండల పరిధిలో ఉషోదయ స్కూల్ (గార్గేయపురం), క్రీడో ది స్కూల్ (బి.తాండ్రపాడు), న్యూబ్రిలియంట్ స్కూల్ (మంత్రాలయం–వగరూర్), ఏపీఆర్ టెక్నో స్కూల్ (పత్తికొండ), గ్లోబల్ యూపీ స్కూల్(ఎమ్మిగనూరు–దైవందిన్నె), విజయ విద్యా విహార్ (ఎమ్మిగనూరు), శ్రీవేణు విద్యాలయ (ఎమ్మిగనూరు), శ్రీవాణి విద్యాలయ (ఎమ్మిగనూరు), ప్రతిష్ట విద్యానికేతన్ (ఎమ్మిగనూరు), శ్రీశారదా విద్యా పీఠం (ఎమ్మిగనూరు) స్కూళ్లు పోర్టల్‌లో నమోదు చేసుకోలేదని అధికారులు తెలిపారు.